క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ట



గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం): పట్టణ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో బోయకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ట చేశారు. కార్యక్రమానికి హాజరైన పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పట్టణ పరిధిలోని న్యూ జగనన్న కాలనిలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీలాభాల గంగమ్మ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతల పాల్గొని పూజలు నిర్వహించారు. అంతకు మునుపు ఉదయం మండలంలోని శెట్టివారిపల్లి పంచాయతీ ఎం.కొత్తపల్లిలో గుణశేఖర్ నూతన గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరై వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమాలలో వాల్మీకిపురం మాజీ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, జే క్రిష్ణమూర్తి, రమేష్‌కుమార్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, కుమార్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శేష వాహనంపై నరసింహుడు



శేషవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి

కలికిరి: పట్టణంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు నరసింహస్వామి శుక్రవారం రాత్రి సతీసమేతంగా శేష వాహనంపై పురవీధులలో విహరించారు. ఇంటింటా భక్తులు స్వామివారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులిచ్చి దర్శించుకున్నారు. ఉదయం తిరుమంజనం కార్యక్రమంలో భాగంగా స్వామివారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం అనంతరం విశేష అలంకరణ చేశారు. భక్తులు స్వామి వారిని దర్శించుకున్న మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు మురళీధరాచార్యులు, అర్చక బృందం పాల్గొన్నారు.


కల్యాణం.. కమనీయం



సీతారాముల ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బి.కొత్తకోట : స్థానిక హరి మందిరం వీధి ఆలయంలో విగ్రహాల ప్రతిష్టాపన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీతా రాముల కల్యాణోత్సవం వేడుక వైభవంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఆలయం ఎదుట ఏర్పాటు చేసిన మండపంలో కొలువుదీర్చారు. పెద్ద సంఖ్యలో హాజరైన భక్తుల సమక్షంలో అర్చకులు సీతారాముల కళ్యాణ వేడుక జరిపించారు. అనంతరం ఆలయంలో సీతా, కోదండ రామస్వామి, లక్ష్మణ స్వామి, హనుమంతు స్వామి, గణపతి స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు పట్టణంలోని ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తల్లి పాలు అమృతంతో సమానం



అవగాహన కల్పిస్తున్న సీడీపీవో భాగ్యమ్మ

పెద్దతిప్పసముద్రం: తల్లి పాలు బిడ్డకు అమృతంతో సమానమని బిడ్డ పుట్టిన అరగంటలోపు తల్లి పాలు తాపించడం ఏంతో ప్రయోజనకరమని ఐసీడీఎస్ సీడీపీవో భాగ్యమ్మ సూచించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రంలోని మూడవ సెక్టార్ కేంద్రంలో కిశోరీ వికాసంపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. చిన్నారి పిల్లల సంరక్షణ, బాలికల హక్కులు, చట్టాలు, టోల్ ఫ్రీ నంబర్లు, గర్భిణులు, బాలింతల ఆహార నియమాలపై ఆమె అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న ఉత్తర గోగ్రహణం

పీలేరురూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిర్వహిస్తున్న పంచమవేద మహాభారత యజ్ఞంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన ఉత్తర గోగ్రహణం నాటకం అలరించింది. కౌరవులు, అర్జునుడు, ఉత్తరకుమారుడు యుద్ధం ఘట్టాన్ని కళాకారులు రక్తి కట్టించారు. అర్జునుడు ఆవుల మళ్లింపు కార్యక్రమం ఆకట్టుకుంది.

సెమిస్టర్ ఫలితాలు విడుదల

కలికిరి: జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం సెకెండ్ సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.వెంకటేశ్వరరావు విడుదల చేశారు. ఫలితాలల్లో విద్యార్థులు 74.26 శాతం ఉత్తీర్ణత సాధించారని, సీఎస్ఈ విద్యార్థులు అత్యధికంగా 93.94 శాతం ఉత్తీర్ణులైనట్లు పరీక్షా విభాగాధిపతి ఆచార్య త్యాగరాజన్ తెలిపారు.

ఆ త్యాగం.. అనుపమానం

- నేడు ఈద్–ఉల్–అజ్‌హా
- ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు

మదనపల్లె సిటీ: త్యాగం చేసేందుకు వెనుకాడకూడదని సందేశాన్నిచ్చే పండుగ బక్రీద్. ప్రవక్త హజరత్ ఇబ్రహీం త్యాగనిరతి, సహనశీలత, రుజువర్తలను తెలుపుతుంది. మానవాళికి మార్గదర్శకత్వం వహించడానికి దైవం పక్షాన అవతరించిన ప్రవక్తల్లో ఇబ్రహీం ఒకరు. ఐదు వేల సంవత్సరాల క్రితం జన్మించిన ఆయన ×దేవుడే సకల చరాచర సృష్టికి కారకుడని, ఆయన పట్ల భక్తి ,శ్రద్ధలు ప్రకటించడం ద్వారా ముక్తిని పొందవచ్చునని జాతికి పిలుపునిచ్చారు. ఇస్లాంలో రంజాన్‌కు ఎంత ప్రాధాన్యత ఉందో బక్రీద్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఉంది. శనివారం జిల్లాలో ఆయా దర్గాలు, మసీదుల్లో బక్రీదు వేడుకలు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆర్థికంగా ఇబ్బందులు లేని ప్రతి వ్యక్తి ఖుర్బానీ ఇవ్వడం ఈ పండుగ సంప్రదాయం. ఖుర్బానీ ద్వారా వచ్చిన మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక వంతు పేదలకు, రెండో భాగాన్ని బంధుమిత్రులకు ఇస్తారు. మరో భాగాన్ని తమ కోసం వాడుకుంటారు.



బక్రీద్ పండుగకు ముస్తాబైన ఈద్గా

ఈద్గా, మసీదులు ముస్తాబు

మదనపల్లె పట్టణం బెంగళూరు రోడ్డులోని ఈద్గా మైదానం బక్రీదు పండుగకు సర్వం సిద్ధం చేశారు. వేలాది మంది ముస్లింలు సామూహిక ప్రార్థనలు చేసుకునేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దీంతో పాటు అన్ని మసీదుల్లో కూడా ప్రార్థనలకు సిద్ధం చేశారు.

భక్తి ప్రదాయిని 'బక్రీద్'

బి.కొత్తకోట: కన్నబిడ్డ కంటే, లోకంలో అన్ని సుఖాల కంటే 'దేవునిపై విశ్వాసమే మిన్న' అని నిరూపించేదే బక్రీద్ పండుగ సారాంశం. బక్రీ అంటే మేక... ఈద్ అంటే పండుగ, రెండు కలిపితే బక్రీద్. దేవుని ఆదేశాలను మానవులు ఏ విధంగా తూచా తప్పకుండా పాటించారో స్పష్టం అవుతుంది. కలలో వచ్చిన దాన్నే దేవుని ఆదేశంగా భావించి కన్నబిడ్డను ఖుర్బానీ (బలి) ఇవ్వడానికి సిద్ధమైన తండ్రి ఉదంతమే బక్రీద్. 'ఇబ్రహీం-ఖలీలుల్లా అలైహిస్సోల్లాం' తన 80వ ఏట వరకూ సంతానం కలుగలేదు. బాధతప్త చింతనతో దేవుడిని ప్రార్థించడంతో సంతానం కలుగుతుంది. దైవానుగ్రహంతో జన్మించిన సంతానానికి 'ఇస్మాయిల్ జబీవుల్లా' అని నామకరణం చేసి దైవప్రసాదంగా భవించి అల్లారుముద్దుగా పెంచసాగారు. బిడ్డపైనున్న ప్రేమాభిమానాలను చూసిన దైవదూతలు భక్తి గొప్పదా, ప్రేమ గొప్పదా అంటూ దేవునితో వాదిస్తారు. భక్తులకు ప్రేమకన్నా, తన ఆదేశమే గొప్పదని నిరూపించేందుకు ఇబ్రహీం ఖలీలుల్లాకు దైవం పరీక్ష పెట్టారు. ప్రతిరోజూ దైవప్రార్థనల తరువాత నిద్రపోతున్న ఇబ్రహీం ఖలీలుల్లాకు కలలో ఖుర్బానీ ఇచ్చినట్టుగా కనిపిస్తుంది. దీంతో దైవ ఆదేశంగా భావించి ఒంటెలను సమర్పిస్తారు. మళ్లీ ఖుర్బానీ ఇచ్చినట్టుగా కలగంటారు. రెండవరోజూ అలాగే చేస్తారు. మూడోరోజు కలలో తనకు ప్రియమైన దాన్ని ఖుర్బానీ ఇవాలని స్పష్టమైన ఆజ్ఞా వస్తుంది. తనకు ప్రియాతిప్రియమైనది ఏకైక సంతానమైన ఇస్మాయిల్ జబీవుల్లాయే కాబట్టి తనబిడ్డను ఖుర్బానీ ఇచ్చేందుకు సంసిద్ధుడవుతాడు. బిడ్డను తీసుకొని మక్కా సమీపం చేరుకొంటారు ఇబ్రహీం ఖలీలుల్లా. అల్లారుముద్దుగా పెంచిన ఇస్మాయిల్ జబీవుల్లా గొంతుపై కత్తితో నరుకుతాడు. గొంతు తెగదు. పలుమార్లు ప్రయత్నించినా తెగదు. అనంతరం స్వర్గలోకం నుంచి ఒక దుంబా పంపబడుతుంది. దాన్ని ఖుర్బానీ ఇవ్వడంతో బక్రీద్ పండగ ప్రారంభమైందని చెబుతారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

పీలేరు : స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగిసినట్లు గ్రంథాలయాధికారి అన్నారు. శుక్రవారం ముగింపు సమావేశం నిర్వహించారు. విజ్ఞాన శిబిరంలో భాగంగా చిత్రలేఖనం, క్విజ్, వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు అందిస్తున్న సేవలు పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగమాస్టర్ శ్రీలత, సంగీతం మాస్టర్ లక్ష్మీశ్రీనివాస్, పి. మంజుల, విద్యార్థులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోండి

కలకడ : విద్యార్థులు, పాఠకులు స్థానిక గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కలకడ గ్రంథాలయాధికారి అమరనాథ కోరారు. శనివారం స్థానిక కలకడ గ్రంథాలయ శాఖలో వేసవి శిక్షణ కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రంథాలయంలో కథలు, పాఠ్యపుస్తకాలు, పోటీపరీక్షలకు వినియోగించే పుస్తకాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వ్యాసరచన, వకృత్వ, డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

నేటి నుంచి గంగమ్మ తిరునాల

కలికిరి: మండలంలోని గుట్టపాళెం గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీపాలేటి గంగమ్మ తిరునాల శనివారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బాలరెడ్డెప్ప తెలిపారు. శనివారం ఉదయం అమ్మవారి ఊరేగింపు ఉత్సవం ప్రారంభమై, అమ్మవారి ఆలయ ప్రవేశం, ఆదివారం ఉదయం దొరల వంశీయులచే కళశ స్థాపన, శాంతి పూజలు, అనంతరం మాగసాని వంశీయులచే సిద్దలపూజ, నగిరి బోణం, భక్తుల దీలు, బోనాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి చాందినీ బండ్లు ఊరేగింపు, పారువేట ఉత్సవం, కళ్లిపాటుతో ఉత్సవాలతో తిరునాల ముగుస్తుందని, భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్త కోరారు.

కలికిరి: మండలంలోని గుండ్లూరులో వెలసిన గ్రామదేవత మూలస్థానమ్మ జాతర శనివారం నుంచి మూడు రోజుల పాటు జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. 7న ఉదయం సిద్ధపూజ, బయనేని వారిచే మూలస్థానమ్మ హరికథ కాలక్షేపం, 8న ఆదివారం ఉదయం శిల్లు బోనాలు సమర్పణ, చాందినీబండ్లు ఊరేగింపు, 9న సోమవారం రాత్రి అమ్మవారి పుష్పపల్లకీ సేవలోభక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరారు.

దరఖాస్తు చేసుకోండి

తంబళ్లపల్లె : స్థానిక టీఎస్. వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో టైలరింగ్ శిక్షణ కోసం ఈనెల 9వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్ సెంటర్ల ద్వారా 3 నెలల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన 15 సంవత్సరాల నుంచి 45 ఏళ్ల లోపు వయస్సు కలిగిన మహిళలు ఈనెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కార్మికుల వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయికులు

మదనపల్లె : దినసరి కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరుతూ సీపీఐ, ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పి.ఎల్ నర్సింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఐదు నెలలుగా వేతనాలు చెల్లించలేదని తెలిపారు. దీంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. జిల్లా ఆడిటర్ నిర్లక్ష్యం కారణంగానే కార్మికులకు వేతనాలు పెండింగులో ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారని కలెక్టర్ చొరవ చూపి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు టి.కష్ణప్ప, నియోజకవర్గ కార్యదర్శి మురళి, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్ కుమార్, మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు మస్తాన్, కార్యదర్శి చలపతి నాయుడు సంజీవ, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి ముబారక్, తిరుమల, జానకి, దేవా, వాసు, శ్రీనివాసులు, శేఖర పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో..!

పీలేరు : ప్రజలకు మంచినీరు అందించే సదుద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ప్రత్యేక చొరవ చూపి మండలంలో 40 ఆర్‌వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఆర్‌వో ప్లాంట్ల నిర్వహణకు ఒక్కో ప్లాంటుకు ఒక్కరు చొప్పున ఆపరేటర్లను నియమించారు. గత ప్రభుత్వంలో ప్రతి నెలా జీతాలు సక్రమంగా అందించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది కాలంగా జీతాలు అందకపోవడంతో ఆపరేటర్లు కుటుంబ పోషణకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పీలేరు పట్టణంలో 25 మంది ఆపరేటర్లు పని చేస్తున్నారు. జీతాలు అందలేదని ప్రశ్నిస్తే విధుల నుంచి తొలగిస్తామని పంచాయతీ అధికారులు బెదిరించే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదాం



వైఎస్సార్‌సీపీ నాయకులతో నిసార్‌అహ్మద్

నిమ్మనపల్లె : కూటమి ప్రభుత్వం ఏడాదిపాలనా వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళదామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తవళం మాజీ సర్పంచ్ మల్లికార్జున నూతన గృహ ప్రవేశ కార్యక్రమం, చల్లావారిపల్లె నూరాని మసీదులో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై పార్టీని పటిష్టపరిచేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమిప్రభుత్వం ప్రజలను మోసగిస్తూ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందన్నారు. సూపర్‌సిక్స్ హామీలపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారేమోనన్న భయంతో, రోజుకో డ్రామాలు ఆడుతూ ప్రజలను మభ్యపెడుతోందన్నారు. తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ ఉచిత బస్సు, అన్నదాత సుఖీభవ పథకాలను ఏడాది గడిచినా అమలుచేయకుండా కాలయాపన చేస్తోందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలో లేని లోటు ప్రజలందరికీ తెలిసివచ్చిందని, ఇప్పుడు ఎన్నికలు జరిగితే.. కచ్చితంగా అధికస్థానాల్లో వైఎస్సార్ సీపీ విజయకేతం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కొమ్మేపల్లె శ్రీనివాసులురెడ్డి, రిటైర్డ్ ఎంప్లాయిస్ అధ్యక్షులు రమణారెడ్డి, వైస్ ఎంపీపీ జయప్రకాష్‌రెడ్డి, నాయకులు శంకర, బొమ్మనపల్లె లక్ష్మన్న, రవీంద్ర, నాగార్జున, గంగాధర, స్వామి, సాదిక్, జబీర్, తాజ్, యాసిన్, అంజాద్, ఖాదర్‌బాషా, నిమ్మనపల్లె రఫీ, మస్తాన్, ముబారక్, కిజర్‌ఖాన్, హైదర్‌సాబ్ పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు ఎంపిక

పెద్దతిప్పసముద్రం: ఈ ఏడాది వెలువడిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు ఎంఈఓ నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండల స్థాయిలో సత్తా చాటిన పీటీఎం తెలుగు, కందుకూరు, రంగసముద్రం హైస్కూళ్ళలో చదివిన మాధవి, చందన, మహేష్, మధుశ్రీ, బావాజాన్‌లు ప్రతిభా పురస్కారాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. సదర విద్యార్థులకు ఈ నెల 9న జిల్లా కలెక్టర్ ప్రశంసా పత్రాలు మెడల్స్ అందజేస్తారని ఎంఈఓ తెలిపారు.

తంబళ్లపల్లె : మండలంలో పదోతరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి ఉత్తమ మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులు ప్రతిభ అవార్డులకు ఎంపికైనట్లు ఎంఈఓ త్యాగరాజు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ హేమంత్‌కుమార్ తెలిపారు. మోడల్ స్కూల్ నుంచి నవీన్‌కుమార్‌రెడ్డి, వాహిద్, పల్లవి, జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి హిమబిందు, గోపిదిన్నె ఉన్నతపాఠశాల నుంచి జ్యోత్స్నవి ఎంపికయ్యారన్నారు. అదేవిధంగా మోడల్ స్కూల్‌లో 8వతరగతి విద్యార్థి ఎస్.అర్షద్, జెడ్పీ ఉన్నతపాఠశాల నుంచి మధుప్రియ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు తెలిపారు.

రామసముద్రం: రామసముద్రం మండలం చొక్కాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివే విద్యార్థిని లక్ష్మీప్రసన్న ఎన్ఎన్ఎంఎస్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సందీప్ తెలిపారు. ఈ బాలికకు 8,9,10 , ఇంటర్మీడియట్ వరకు ఐదేళ్లపాటు ఏడాదికి రూ.15 వేలు చొప్పున స్కాలర్‌షిప్ అందనున్నట్లు తెలిపారు. బాలిక ఎంపిక పట్ల హెచ్‌ఎంతో పాటు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు

బి.కొత్తకోట : నేషనల్ మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని బడికాయలపల్లె జెడ్పీ హైస్కూల్ కు చెందిన విద్యార్థులు ఎంపిక అయ్యారని ఎంఈఓలు రెడ్డిశేఖర్ భీమేశ్వరాచారి శుక్రవారం తెలిపారు. ఎనిమిదవ తరగతి విద్యార్థులు లోకేష్ నాయుడు, విజయ్ కుమార్, లక్ష్మీ ప్రసన్నలు పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ప్రతి సంవత్సరం రూ.12 వేలు చొప్పున నాలుగేళ్ల పాటు ఆర్థిక సహాయం అందుతుంది.

భోజనం నిర్వహణలో శుభ్రత పాటించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ నాగసుబ్బరాయుడు

తంబళ్లపల్లె : మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం వంటకాలలో శుచి, శుభ్రత పాటించాలని ఎంఈఓ నాగసుబ్బరాయుడు తెలిపారు. శుక్రవారం ప్రాథమిక పాఠశాలలో 63 పాఠశాలల కుకింగ్ కమిటీ సభ్యులకు కొత్త మెనూపై ఒకరోజు శిక్షణా తరగతులు జరిగాయి. మాస్టర్ ట్రైనర్ చంద్రకళ వంటలు వండడం, నాణ్యత, శుభ్రత పాటించడం, మెనూ మేరకు వంటకాలు వడ్డించడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. వంటకాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. హెచ్‌ఎం రెడ్డెప్పరెడ్డి. టీచర్ వెంకట్‌కుమార్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

కేవీపల్లె : దళిత గ్రామాల్లో సమ్యలు పరిష్కరించాలని దళిత ప్రజా సంఘాల నాయకులు ముల్లంగి చంద్రయ్య అన్నారు. శుక్రవారం తహసీల్దార్ నరేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జిల్లేళ్ల మంద, కేవీపల్లె హరిజనవాడ, రామారావుపల్లెలో జరిగిన పౌరహక్కుల దిన సమావేశాలు తూతూ మంత్రంగా జరిగాయని తెలిపారు. ఈ సమావేశాల్లో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు నాలుగు నెలలు అవుతున్నా పరిష్కారానికి నోచుకోలేదని పేర్కొన్నారు. దళితుల సమస్యల పరిష్కారానికి మండల లెవెల్ ఎస్సీ,ఎస్టీ మానటరింగ్ సమావేశం నిర్వహించాలని కోరారు. దళిత సంఘాల నాయకులు అమ్మతపురి నాగేశ్వర, పత్తిపాటి వెంకటేష్ పాల్గొన్నారు.

పేదలకు పండ్లు పంపిణీ

ములకలచెరువు: తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం ములకలచెరువులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. అనంతరం పేదలకు పండ్లు పంచి పెట్టారు. సర్పచ్ మహమ్మద్‌టి, రవిశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, చాంద్‌బాషా, సయ్యద్‌బాషా, పకృద్దీన్, ప్రతాప్ రెడ్డి, విజయ్‌రాజు, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు శుక్రవారం తంబళ్లపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పలువురికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ పట్టెరిక శోభా శంకర్, స్థానిక సర్పంచ్ రహ్మతుల్లా, ఎంపీటీసీ కేశవ్, నాయకులు, కార్యకర్తలు గట్టు శ్రీనివాసులు, హిదాయతుల్లా, నారాయణస్వామి, బుడ్డాబాబు, ఇమ్రాన్ పాల్గొన్నారు. అలాగే పెద్దతిప్పసముద్రంలో ఎంపీపీ మహమూద్, కుందుకూరులో వైస్ ఎంపీపీ శోభా శంకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పుట్టిన రోజు వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ఐకమత్యం, తాగ్యానికి ప్రతీక బక్రీద్

- పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలి
- ఎంపీ మిథున్‌రెడ్డి



ఎంపీ మిథున్‌రెడ్డి



ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



మాజీ ఎమ్మెల్యే చింతల

మదనపల్లె: బక్రీద్ పండుగ త్యాగానికి ప్రతీక అని రాజంపేట పార్లమెంటు సభ్యులు పీవీ.మిథున్‌రెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మదనపల్లె వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ అన్నారు. ముస్లింలు పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండగను పురస్కరించుకుని వారు మాట్లాడుతూ ఈ లోకంలో దైవంపై ఉన్న విశ్వాసానికి మించి మరొకటి లేదని నిరూపించేదే బక్రీద్ అని అన్నారు. ఈ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకుని అల్లా ఆశీస్సులు పొందాలని, కుటుంబసభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఆనందంగా గడపాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించి పని చేశారని గుర్తు చేశారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి విద్య, ఉద్యోగాల్లో నాలుగు శాతం రిజర్వేషన్లు ఇస్తే దాన్ని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కొనసాగిస్తూనే ప్రతిఇంటికి సంక్షేమ పథకాలను అందించి ఆర్థికంగా అండగా నిలిచారని అన్నారు.

కలికిరి(వాల్మీకిపురం): ఐకమత్యం, త్యాగం, సహనానికి ప్రతీకగా బక్రీద్ నిలుస్తుందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. శనివారం బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లింలకు ఆయన బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు.

శుభాకాంక్షలు

మదనపల్లె : బక్రీద్ పర్వదినం సందర్భంగా మదనపల్లె నియోజకవర్గ ముస్లింలకు వైఎస్సార్ సీపీ నేతలు శుక్రవారం శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి. నరేష్ కుమార్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ వి.మనూజరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా వెంకటా చలపతి, ఏపీఎండీసీ మాజీ చైర్ పర్సన్ జి.షమీంఅస్లాం శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు భక్తి శ్రద్ధలతో పండగ జరుపుకుని సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తున్నట్టు తెలిపారు.

బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

బి.కొత్తకోట: బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని మదనపల్లె డీఎస్పీ మహేంద్ర స్థానిక పోలీసులకు సూచనలిచ్చారు. శుక్రవారం ఆయన ప్రార్థనలు జరిగే ఈద్గా, ముస్లింలు వచ్చే మార్గాలను పరిశీలించారు. దీనిపై సీఐ జీవన్ గంగనాథ్ బాబుతో పలు అంశాలపై సమీక్షించారు. ముస్లింలు ఈద్గాకు వచ్చే మార్గంలో రద్దీని నివారించి, ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని కోరారు. పోలీసులతో బందోబస్తు నిర్వహించి పర్యవేక్షించాలని ఆదేశించారు.

కలికిరి: ముస్లింలు ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండుగ జరుపుకోవాలని సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి కోరారు. శుక్రవారం ముస్లిం మత పెద్దలు, మసీదుల ముతవల్లిలతో సమావేశమైన సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మరాదని, ఎవరైనా మత విద్వేశాలను రెచ్చగొట్టే ప్రసంగాలుగానీ, పోస్టులు పెట్టకూడదన్నారు. అటువంటి వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

రికార్డింగ్ డ్యాన్స్ నిషేదం

మండలంలోని గుండ్లూరు, గుట్టపాళెం గ్రామాల్లో శనివారం నుంచి సోమవారం వరకు జరుగు మూడు రోజుల జాతర ఉత్సవాల్లో చాందినీబండ్లు కట్టే భక్తులు పోలీసు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, చాందినీ బండ్ల వద్ద రికార్డింగ్ డ్యాన్స్‌లు నిషేదమన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై చర్యలు తప్పవన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

మదనపల్లె రూరల్ : పట్టణంలోని మంజునాథకాలనీలో యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరు వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సహకారంతో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. మంజునాథ కాలనీ ప్రీ ప్రైమరీ స్కూల్‌లో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో దాదాపు 300 మందికి పైగా పాల్గొని చికిత్సలు పొందారు. కంటిసమస్యలతో ఇబ్బందులు పడుతున్న 20మంది, క్యాన్సర్‌తో బాధపడుతున్న ఐదుగురికి ఉచితంగా యంగ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వైద్యం చేయిస్తామని అధ్యక్షులు రాజశేఖర్ హామీ ఇచ్చారు. సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ శాంతమ్మ, మల్లీశ్వరి,ఫౌండేషన్ సభ్యులు అనిల్, శ్రావ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో మరమ్మతు పనులు

పీలేరురూరల్ : పీలేరు ఆర్టీసీ బస్టాండులో రూ. 6 లక్షలతో మరమ్మతు పనులు చేస్తున్నట్లు ఈఈ కేఎస్ఎస్ శ్రీనివాస్ అన్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీలింగ్ వర్క్, పెయింటింగ్ వర్క్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. మరుగుదొడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, టెండర్ల ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు. త్వరలో అధునాతన సౌకర్యాలతో మరుగుదొడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. డీఈ పోతురాజు, ఏఈ సిద్ధనాగులు, బస్టేషన్ మేనేజర్ బాబునాయక్ తదితరులు పాల్గొన్నారు.